

ఎన్టీఆర్ ప్రాంగణంలో తేదేపా జెండాను ఆవిష్కరించిన తేదేపా నాయకులు

# ప్రజల ఆదరణే పార్టీలకు సూచిక

❖ మూడో తేదీకి ఏర్పాట్లు పూర్తి ❖ సింహగర్జన రికార్డు తిరగరాస్తాం

**గ్రామీణమంగళగిరి:** 'ప్రజల ఆదరణే పార్టీలకు సూచిక. ప్రజల మద్దతు సంపూర్ణంగా తెలుగుదేశానికి ఉంద'ని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు పేర్కొన్నారు. మండలంలోని కాజ గ్రామపరిధిలో ఎన్టీఆర్ ప్రాంగణంలో యువగర్జన సదస్సు ఏర్పాట్లను పార్టీ సీనియర్ నాయకులు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, కోడెల శివప్రసాదరావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర, ప్రాంగణం కన్వీనర్ మాదల రాజేంద్ర, జడ్పీ మాజీ అధ్యక్షుడు పాతూరి నాగభూషణం, కాగిత వెంకట్రావు, యరపతినేని శ్రీనివాసరావు, అన్నాబత్తుని శివకుమార్‌లతో యనమల రామకృష్ణుడు గురువారం పరిశీలించారు. ప్రాంగణం కన్వీనర్ మాదల రాజేంద్ర నేతృత్వంలో యువగర్జన ఏర్పాట్లు బ్రహ్మాండంగా సాగుతున్నాయని కొనియాడారు. మూడోతేదీ నాటికి వేదిక, అలంకరణ, బారికేడింగ్, సౌండ్, లైటింగు పనులు పూర్తి చేస్తామన్నారు. అదేరోజు సాయంత్రం ట్రయల్ వేస్తామని తెలిపారు. ఎన్టీఆర్ హయాంలో హైదరాబాద్‌లో నిర్వహించిన సింహగర్జనకు వచ్చిన ప్రజాదరణ ఇప్పటివరకూ ఏ సదస్సుకూ రాలేదని యనమల చెప్పారు. ఇప్పటికీ ఈ రికార్డును అధిగమించడం ఎవరి వల్లా కాలేదన్నారు. మళ్ళీ యువగర్జనతో సింహగర్జన రికార్డును తిరగ రాస్తామని, తమ రికార్డును తామే బద్దలు చేయగలమని నిరూపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. విజయవాడ నుంచి మంగళగిరి, గుంటూరు వరకూ మొత్తం అంతా పసుపుమయం చేస్తామన్నారు. హెలికాప్టర్‌తో యువగర్జన ప్రాంగణంలో పూలు చల్లించేందుకు ఏర్పాటు చేశామని చెప్పారు. లక్ష పసుపు బెలూన్లను ప్రాంగణం నలుమూలల నుంచి ఎగురవేస్తామన్నారు. 10 లక్షల జెండాలతో పరేడింగ్ చేస్తామని వివరించారు. దూరప్రాంతాలనుంచి వాహనాలకు చక్కని పార్కింగ్ సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు.